క్లుప్తంగా

నేటి నుంచి ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు

రుద్రవరం: మండలంలోని ఏపీ మోడల్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు ఆదివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, ఏప్రిల్ 21న మోడల్ పాఠశాలలోనే 5వ తరగతి సిలబస్‌తోనే ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఇక్కడ బోధన అంతా ఇంగ్లిష్ మీడియంలోనే ఉంటుందని చదువుకునేందుకు ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష రాసేందుకు ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.75 ప్రకారం ఈనెల 31వ తేదీ లోపు రుసుము చెల్లించాలని వెల్లడించారు.

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: రుద్రవరం–అప్పనపల్లె దారిలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామికి శనివారం భక్తులు విశేష పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు గోపీశర్మ ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు గావించి, ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు


బహుమతులు సాధించిన క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక వివేకానంద ఆడిటోరియంలో జీత్‌కునేడో కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన క్రీడాకారులకు వివిధ కరాటే బెల్ట్‌లను శనివారం అందజేశారు. జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ నేతృత్వంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ పాల్గొని ఆరు బ్లాక్, ఒక ఆరెంజ్, 15బ్లూ, 22 గ్రీన్, 80 ఎల్లో బెల్ట్‌లను అందజేశారు. లయన్స్‌క్లబ్ నంద్యాల కార్యదర్శి నాగరాజు, కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


చాగలమర్రి ఉన్నత పాఠశాలలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న ఆర్‌ఓ మల్లికార్జునరెడ్డి

చాగలమర్రి: నంద్యాల ఆర్‌డీఓ, ఆళ్లగడ్డ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జునరెడ్డి శనివారం చాగలమర్రిలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, మెయిన్ ప్రాథమిక పాఠశాలలోనున్న పోలింగ్ బూత్‌లను డీటీ విజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 2,30.914 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, కొత్తగా 14 వేల ఓటర్ కార్డులను పంపిణీ చేశామన్నారు. కొత్త ఓటరు కార్డులకు బార్‌కోడ్ ఉంటుందని, దీంతో దొంగ ఓట్లను అరికట్టే వీలుందన్నారు. 85 సంవత్సరాల వయస్సు నిండిన వృద్ధులు, దివ్యాంగులకు రానున్న ఎన్నికల్లో హోం ఓటింగ్ విధానాన్ని ఎన్నికల సంఘం అమలుపరచనుందని చెప్పారు. నియోజకవర్గంలోని 6 మండలాల్లో మొత్తం 295 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో 52 పోలింగ్ కేంద్రాలను చాగలమర్రి మండలంలో ఏర్పాటు చేశామని వివరించారు.

రుద్రవరం: మండలంలోని ఆలమూరు,నర్సాపురం,పెద్దకంబలూరు,ఎల్లావత్తుల తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి శనివారం పరిశీలించారు. ఈ ఎన్నికల్లో దాదాపు 6వేల మంది యువతీ యువకులు కొత్తగా ఓటు హక్కు వినయోగించుకోనున్నారని చెప్పారు.

92 శాతం పింఛన్ల పంపిణీ


ఇంజేడులో కిడ్నీ బాధితుడు పుల్లయ్యకు రూ.10 వేలు అందజేస్తున్న వలంటీర్ లక్ష్మీదేవి

ఉయ్యాలవాడ : మండలంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ 92 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ రఘురాం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో 3,983 మంది లబ్ధిదారులకు గానూ ఇప్పటి వరకు 3,666 మందికి 11 గ్రామ సచివాలయాల పరిధిలో వలంటీర్లు రూ.1,08,11,500 నగదు పంపిణీ చేశారని చెప్పారు.

సేవా దృక్పథం పెంపొందించుకోవాలి

గోస్పాడు: విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలని ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జ్ డాక్టర్ సంతోష్‌కుమార్ అన్నారు. కానాలపల్లె గ్రామంలో శనివారం వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రాథమిక పాఠశాల, రామాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రం, పరిసరాలను శుభ్రం చేశారు.

రబీ పండింది

- కలిసొచ్చిన వ్యవసాయం
- లాభాల బాటలో రైతులు
- ముమ్మరంగా సాగుతున్న పంట కోతలు

రుద్రవరం: ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రైతుల ఇంట ధాన్యం రాసులు సిరులు కురిపించాయి. ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఊహించని రీతిలో దిగుబడి లభించగా, అదే స్థాయిలో ధర కూడా పలికింది. ఇక రెట్టించిన ఉత్సాహంతో కొందరు రైతులు చెరువులు, బోర్ల కింద రబీలోనూ వివిధ రకాల పంటలు సాగు చేయగా అవి కూడా ఆశించిన స్థాయిలో పండటం, ధర మరింత ఎక్కువగా లభించడంతో రైతులు మంచి లాభాలు గడించారు. మండలంలోని 21గ్రామ పంచాయతీల పరిధిలో వివిధ రకాల పంట కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ధాన్యం దిగుబడులను రైతులు కళ్లాలు, బయలు ప్రదేశాలు, ఆర్‌అండ్‌బీ రోడ్లపై ఆర బెట్టుకుంటున్నారు. మరొకొందరు సరైన ధర లభిస్తే అక్కడికక్కడే వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రభుత్వం తెలుగుగంగ కాల్వల ద్వారా సాగు నీరు అందించడంతో వరి, మొక్కజొన్న, మినుము


తిప్పారెడ్డిపల్లె వద్ద ఆరబోసిన మొక్కజొన్నలు

వంటి పంటలన్నీ మంచి దిగుబడులు వచ్చాయి. వాటికి తగ్గట్టుగానే ధర కూడా బాగా ఉండటంతో రైతులు మంచి లాభాలు గడించారు. ఖరీఫ్‌లో మంచి లాభాలు వచ్చాయన్న సంతోషంతో రబీలోనూ రైతులు వరి 3వేల హెక్టార్లలో, జొన్న 2,194 హెక్టార్లలో, మొక్కజొన్న 2,024 హెక్టార్లలో, మినుము 1,924 హెక్టార్లలో సాగు చేయగా వారి ఆశలు ఫలించాయి. వాతావరణం అనుకూలించి రబీలోనూ ఎక్కడ చూసినా ధాన్యపు రాసులే కనిపిస్తున్నాయి. వరి ఎకరానికి 35 బస్తాల వరకు దిగుడబడులు రాగా.. మొక్కజొన్న 25 నుంచి 30 బస్తాలు, జొన్న 15 – 25 బస్తాల వరకు దిగుబడులు వచ్చాయి. ధరలను పరిశీలిస్తే.. వరి (బస్తా –75కేజీలు) రూ.2,600, మొక్కజొన్న క్వింటా రూ.2,100, జొన్న క్వింటా రూ.2,700 నుంచి రూ,3,100 వరకు పలుకుతున్నాయి. పెట్టుబడులు పోనూ మంచి లాభాలు వచ్చాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


అప్పనపల్లె వద్ద సంచుల్లో నింపిన ధాన్యం



మంచి దిగుబడులు వచ్చాయి

జొన్నలను చూపుతున్న రైతు పేరు కృష్ణారెడ్డి, ఎర్రగుడిదిన్నె వాసి. 'తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్‌లో పదెకరాలను బీడుగా వదిలేశా. అయితే ప్రభుత్వం తెలుగుగంగ ద్వారా విడతల వారీగా సాగు నీరిచ్చింది. ఆ నీరు గ్రామంలోని చెరువుకు చేరింది. దీంతో రబీలో పదెకరాల్లో జొన్న సాగు చేశా. వాతావరణం అనుకూలించడం, నీటి తడులకు ఇబ్బందులు లేకపోవడంతో ఎకరాకు 28 బస్తాల ప్రకారం దిగుబడి లభించింది. ధర కూడా క్వింటా రూ.3,100 లభించడంతో వెంటనే విక్రయించా. ఇంతటి దిగుబడి, ధర మునుపెన్నడూ చూడలేద'ని సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

ప్రశాంతంగా టెట్ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని నాలుగు కేంద్రాల్లో టెట్ పరీక్షలు శనివారం ఉదయం ప్రశాంతంగా జరిగాయి. ఎస్‌ఏ–1, 2 పరీక్షలు ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం 1.30 గంటలకు జరిగాయి. ఆర్‌జీఎం, శాంతిరాం, ఎస్‌వీఆర్, రామకృష్ణ కళాశాలల్లో జరిగిన పరీక్షలకు 1,112 మంది హాజరు కాగా 118 మంది గైర్హాజరైనట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. స్క్వాడ్ అధికారి బ్రహ్మం నాయక్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన అభయాంజనేయ స్వామి, శ్రీ లక్ష్మీ నరసింహ కంబగిరి స్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో మాఘ మాసం సందర్భంగా శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, కుంకుమార్చన, వడ మాల, ఆకుపూజలు చేపట్టారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, కమలేష్‌శర్మ, అనంతయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మీ నరసింహ కంబగిరి స్వామి

నంద్యాలను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి
- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా
- 980 మంది నిరుద్యోగుల హాజరు
- పాల్గొన్న 20 కంపెనీలు
- ఉద్యోగాలకు 348 మంది అభ్యర్థుల ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): నంద్యాలను ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక పీఎస్సీ, కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 20 కంపెనీలు పాల్గొన్న జాబ్‌మేళాకు 980 మంది సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ శశికళ మాట్లాడుతూ జాబ్ మేళాలో 348 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి డిగ్రీతో పాటు ఉపాధిని కూడా కల్పించుకొనేలా ప్రభుత్వం జాబ్ మేళా ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్నారు. జేకేసీ సమన్వయకర్త పార్వతి, మహబూబ్‌బాషా, డీఎస్‌డీఓ ప్రతాపరెడ్డి, అధ్యాపకులు, ఎన్‌సీసీ అధికారి గంగన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

గోశాల నిర్మాణానికి నేడు భూమి పూజ

గోస్పాడు: మండల కేంద్రంలో చిరుధాన్యాల ఉత్పత్తి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గోశాల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించనున్నారు. ప్రకృతి వ్యవసాయ నిపుణులు సుభాష్ పాలేకర్ శిష్యుడు విజయరామ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు.

న్యాయసేవలపై అవగాహన


జడ్జిని సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో శనివారం న్యాయ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నంద్యాల జిల్లా ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వి.ఆదినారాయణ మాట్లాడుతూ న్యాయం కోసం ప్రతి న్యాయవాది వాదిస్తారన్నారు. నేరాలకు సంబంధించిన కేసులను వాదించే అడ్వకేట్‌ను క్రిమినల్ న్యాయవాది అంటారని, భూ, ఆస్తి, ఆర్థిక, వారసత్వం, కుటుంబ తగాదాల వంటివి సివిల్ వాజ్యాల కిందికి వస్తాయని చెప్పారు. అనంతరం డాక్టర్ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి తదితరులు జడ్జిని సన్మానించారు.


లింగందిన్నెలో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆళ్లగడ్డ: అభివృద్ధి, ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన పలు అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. లింగందిన్నె గ్రామంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.23.94 లక్షలతో నిర్మించిన ఆర్బీకే, రూ.20.80 లక్షలతో పూర్తి చేసిన వెల్‌నెస్ కేంద్రం భవనాలు, రూ.15 లక్షలతో పూర్తి చేసిన సీసీ రోడ్లు, కోటకందుకూరులో రూ.25 లక్షలతో వేసిన సీసీ రోడ్లు, ఆర్.కృష్ణాపురంలో రూ.11 లక్షల సీసీ రోడ్లు, బాచేపల్లి రూ.43.60 లక్షలతో చేపట్టిన గ్రామ సచివాలయం, రూ.23.94 లక్షలతో ఆర్బీకే, రూ.35 లక్షల సీసీ రోడ్లు, దొరకొట్టాలలో రూ.10 లక్షలతో సీసీ రోడ్లు, అహోబిలంలో రూ. 43.60 లక్షలతో గ్రామ సచివాలయం, రూ. 9 లక్షలతో సీసీ రోడ్లు, మిట్టపల్లెలో రూ. 9 లక్షలతో సీసీ రోడ్లు, రూ.13 లక్షలతో నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, వైస్‌ఎంపీపీ నాసారి ప్రసాద్, ఎంపీటీసీ హేమలత, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొట్టె నాగేశ్వర్‌రావు, నరసింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, రంగారెడ్డి ఉన్నారు.

అభివృద్ధి చేసి చూపుతున్నాం


పొన్నాపురంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): నంద్యాలను అభివృద్ధి చేసి చూపుతున్నామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక 19వ వార్డు పొన్నాపురంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లను కౌన్సిలర్ పరుచూరి నారాయణమ్మతో కలిసి శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో ఎటు చూసినా కొత్త రోడ్లు, సీసీ డ్రైన్లు నిర్మించామని ఇవన్నీ వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి నిదర్శనమన్నారు. నంద్యాల మున్సిపాలిటీలోకి చేరిన గ్రామాలను కూడా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత కల్పించి పట్టణ వాసులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ పరుచూరి శ్రీరాములు, దేశం సుధాకర్ రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, జంబులయ్య, మద్దిలేటిశెట్టి, కుమార్, కృష్ణ, వెంకటేశ్వర్లు, రాజు, మధు గౌడ్, బోడెన్న, సంజన్న, ఖాజా, శ్రీనివాసులు, సుబ్బయ్య, సందీప్, సుంకన్న, సుధాకర్, గోవింద రాజులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

చాగలమర్రి: స్థానిక ఎస్‌వీ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం వైఎస్సార్ జిల్లా, ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ప్రీతి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కో–ఆర్డినేటర్ కిరణ్ కుమార్ శనివారం తెలిపారు. శిబిరంలో ప్రముఖ గుండె, స్త్రీ వ్యాధుల నిపుణులు, జనరల్ ఫిజీషియన్ వైద్యులు వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు.

రిజర్వాయర్‌లో పడి వ్యక్తి మృతి


మృతుడు రాము

రుద్రవరం: నల్లమల అటవీ ప్రాంతంలోని గండ్లేరు (తుండ్ల వాగు) రిజర్వాయర్‌లో శనివారం ఓ మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన రాము (40) కొన్నేళ్లుగా అహోబిలంలో నివాసముంటూ గైడ్‌గా పని చేస్తున్నాడు. శని,ఆదివారాల్లో ఎవరైనా తమిళ వాసులు వస్తే అహోబిలంలో వారికి గైడ్‌గా వ్యవహరించేవాడు. అలాగే అప్పుడప్పుడు గండ్లేరు రిజర్వాయరుకు వెళ్లి చేపలు పట్టేవాడు. ఇందులో భాగంగానే కొందరు స్నేహితులతో కలిసి చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందినట్లు ఇన్‌చార్జ్ వీఆర్వో నీలకంఠేశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

అమ్మాయిల చదువుతోనే సమాజంలో వెలుగులు

నంద్యాల(అర్బన్): ఆడపిల్లలు చదువుకోవడం ద్వారానే సమాజంలో వెలుగులు నిండుతాయని ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ పేర్కొన్నారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం చాపిరేవుల గ్రామంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్ నంద్యాల అర్బన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో విద్యార్థినులు, అంగన్‌వాడీ టీచర్లతో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 2015లో ప్రధాని నరేంద్రమోదీ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఆడపిల్లలను రక్షించుకుందాం, ఆడపిల్లలందరూ చదువుకోవాలన్నదే కార్యక్రమం లక్ష్యమని చెప్పారు. రూరల్ సూపర్‌వైజర్ విజయ, ఆరోగ్యమ్మ ఉన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థినులు

వైభవం.. ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో గాయత్రీదేవి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ప్రథమనంది ఆలయంలో శ్రీ గాయత్రీ దేవాలయం 17వ వార్షికోత్సవ వేడుకలు బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి తెల్లవారుజామునే పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకం చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. లోక కల్యాణం కోసం వేదపండితుడు సుధీంద్రాచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా చండీ హోమం జరిపించి పూర్ణాహుతి గావించారు. అనంతరం అన్నవితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. సమాఖ్య అధ్యక్షుడు కరణం మురళీకృష్ణారావు, సుధీర్, కేశవమూర్తి, సాయిశ్రీనాథ్, సురేష్‌వర్మ, సీతారాం పాల్గొన్నారు.


చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

ప్రారంభానికి సిద్ధం

శిరివెళ్ల: మండలంలోని 3 గ్రామ పంచాయతీల్లో రూ.1.73 కోట్ల విలువైన వివిధ పనులు పూర్తవడంతో ఈ నెల 3వ తేదీన జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రారంభించనున్నారు.

- ➡ వెంకటాపురంలో రూ.7.80 లక్షలుతో వేసిన అంతర్గత సిమెంట్ రోడ్లు
- ➡ కోటపాడులో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.23.49 లక్షలతో నిర్మించిన రైతు భరోసా భవనాలు
- ➡ గ్రామ పంచాయతీ నిధులు రూ.4లక్షలతో వేసిన సిమెంట్ రోడ్లు
- ➡ 30 లక్షలతో మన బడి నాడు– నేడు కింద ప్రాథమిక పాఠశాల పనులు, ప్రహరీ
- ➡ చెన్నూరులో రూ.13 లక్షలతో సిమెంట్ రోడ్లు. రూ. 62 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం గోడౌన్‌ను ప్రారంభిస్తారు.


కోటపాడులో రూపుదిద్దిన పాఠశాల

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం

ఆళ్లగడ్డ: పోలియో రహిత సమాజం కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ నెల 3వ తేదీన నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ నరసింహులు అన్నారు. వైద్య కేంద్రంలో శనివారం వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలకు పల్స్ పోలియో కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేపట్టి అక్కడ మానవ హారంగా ఏర్పడి పల్స్ పోలియోపై అవగాహన కల్పించారు. పట్టణ పరిధిలో 5,703 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు 31 బూత్‌లతో పాటు ఒక మొబైల్ టీం ఏర్పాటు చేశామని చెప్పారు. ఎంపీహెచ్‌ఈఓ దస్తగిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ శాంతి ఉన్నారు.

రుద్రవరం: ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాని వైద్య సిబ్బంది ప్రజలకు సూచించారు. ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమం ఉండటంతో మండలంలోని ఆలమూరుతో పాటు పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం వైద్య సిబ్బంది పల్స్ పోలియోపై ర్యాలీ నిర్వహించారు.


చాగలమర్రి: 0–5 సంవత్సరాలలోపు వయసున్న చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు షేక్ ఇమ్రాన్ తెలిపారు. శ్రీరాఘవేంద్ర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులతో శనివారం ప్రధాన వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ రవణమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి పాల్గొన్నారు.


ఆళ్లగడ్డలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

శిరివెళ్ల: ఈ నెల 3న జరగనున్న పల్స్‌పోలియోపై శనివారం శిరివెళ్లలో వైద్య సిబ్బంది ర్యాలీ చేపట్టారు. డాక్టర్ భవ్య మాట్లాడుతు పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేస్తామని, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. సీహెచ్‌ఓ రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

గోస్పాడు: పల్స్ పోలియోను విజయవంతం చేయాలని గోస్పాడు వైద్యాధికారి గోపాల్ కోరారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో శనివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 0–5 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. గోస్పాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 18 బూత్‌లలో 1,808 మంది, జిల్లెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 11 బూత్‌లలో 1,413 మందికి, యాళ్లూరు సీహెచ్‌సీ పరిధిలో ఆరు బూత్‌లలో 750 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. 140మంది పారామెడికల్ సిబ్బంది ఆయా కేంద్రాల ద్వారా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించేలా చర్యలు చేపట్టామన్నారు.

ఉయ్యాలవాడ : మండలంలోని పెద్దయమ్మనూరు, మాయలూరు, ఉయ్యాలవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆదివారం 0–5 సంవత్సరాల్లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు వైద్యాధికారులు వెంకటసుబ్బయ్య, రాబర్ట్ కెనడీ, విజయదుర్గ పేర్కొన్నారు. శనివారం ఆయా గ్రామాల్లో పోలియో నిర్మూలనపై విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండు ఆవరణలో విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది మానవహారంగా ఏర్పడి పోలియో మహమ్మారిని తరిమికొడుదామని ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్లు దస్తగిరి, రామచంద్రుడు, మునిస్వామి పాల్గొన్నారు.


ఉయ్యాలవాడ బస్టాండులో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది

చట్టంపై బాలికలకు అవగాహన

నంద్యాల(అర్బన్): బాలల న్యాయ చట్టంపై బాలికలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల సంరక్షణ అధికారిణి శారద తెలిపారు. స్థానిక వరల్డ్ విజన్ సంస్థ కార్యాలయంలో శనివారం బాలల న్యాయ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలల హక్కుల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, సమాచారం అందిన వెంటనే వాటిని నిలిపి వేయాలన్నారు. సంస్థ పీఓ తిరుపతిరావు, నర్మదా, మదర్ సొసైటీ వ్యవస్థాపకుడు రామారావు, పద్మావతి, నరసింహులు ఉన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

నంద్యాల(సిటీ): పట్టణంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణవాసులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నామన్నారు. దోమల నియంత్రణకు పిచికారీ, ఫాగింగ్ చేస్తున్నామని చెప్పారు.